9

సాక్షి విశాఖపట్నం

బుధవారం ı 25 ı డిసెంబర్ ı 2024







ప్రేమ కాంతులు

నగరానికి క్రిస్మస్ శోభ కాంతులీనుతున్న చర్చిలు



సీతమ్మధార బాలయేసు చర్చిలో క్రిస్మస్ సందర్భంగా బాలయేసు బొమ్మలతో యువతీ, యువకులు

నగరంలో క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు, క్రైస్తవుల ఇళ్లలో కాంతులు విరజిమ్ముతున్నాయి. నగరంలో శతాబ్దాల చరిత్ర గల లండన్ మిషన్ మెమోరియల్ సీఎస్ఐ చర్చి, సెయింట్ ఆంథోని చర్చి, సెయింట్ ఆలోసిన్, సెయింట్ జాన్స్, సెయింట్ ప్యాలీస్, సెయింట్ పీటర్స్, ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, క్రైస్ట్ చర్చి, ట్రినిటి లూథరన్ చర్చిలు కళ్లు మిరుమిట్లు గొలిపేలా విద్యుత్ అలంకరణలతో జిగేల్ మంటున్నాయి. మరోవైపు క్రిస్మస్ షాపింగ్‌తో మార్కెట్లు కిటకిటలాడాయి. నగరంలోని కొన్ని చర్చిల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. పలువురు ఇళ్లల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పుట్టుకను తెలియపరిచే రీతిలో పశువుల పాకలు, వివిధ ఘట్టాలను అనేక చర్చిల్లో ఏర్పాటు చేశారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







పశువుల పాక సెట్

విద్యుత్ చార్జీలు పెంచి సంపద సృష్టిస్తున్నారా?



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, మాజీ మంత్రులు అమర్‌నాథ్, ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పండుల రవీంద్ర, కుంభా రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్, కంబాల జోగులు తదితరులు

- 27న విద్యుత్ చార్జీల పెంపుపై 'వైఎస్సార్ సీపీ పోరుబాట'
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంపీ విజయసాయిరెడ్డి

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై రూ.15 వేల కోట్ల భారం మోపడాన్ని నిరసిస్తూ ఈనెల 27న తలపెట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం 'వైఎస్సార్ సీపీ పోరుబాట' పోస్టర్‌ను పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విశాఖ జిల్లా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న ముందుగా ప్రతీ నియోజకవర్గంలో సంబంధిత విద్యుత్ కార్యాలయాల అధికారులకు, తర్వాత అంతా కలిసి జిల్లా విద్యుత్ కార్యాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే వినియోగదారులపై సర్దుబాటు చార్జీల పేరిట రూ.15 వేల కోట్లు భారం మోపుతున్నారని మండిపడ్డారు. సంపద సృష్టి అంటే పేదలపై భారం వేయడమా అని ప్రశ్నించారు. నాణ్యమైన విద్యుత్, విద్య, వైద్యాన్ని అందిస్తామని చెప్పి మద్యాన్ని ఏరులా పారిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, పండుల రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, కంబాల జోగులు, మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, చెంగల వెంకటరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, ముఖ్యనేతలు శోభా హైమావతి, బొడ్డేటి ప్రసాద్, రవిరెడ్డి, సూర్యనారాయణరాజు, బాణాల శ్రీనివాసరావు, పిల్లా సుజాత, బి.పద్మావతి, పేడాడ రమణికుమారి, పల్లా చినతల్లి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ విజయసాయిరెడ్డికి, మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు కేక్ తినిపిస్తున్న మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, బోని శివరామకృష్ణ

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి కేక్ కట్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ అగ్నిమాపక కేంద్రం ప్రైవేటీకరణ

ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తుల ఆహ్వానం

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగా.. ప్లాంట్‌కు చెందిన ఒక యూనిట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన అగ్నిమాపక కేంద్రం నడిపే బాధ్యతను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు మొదటి అడుగు పడింది. ఇందుకు సంబంధించి ఉక్కు యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానించింది. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఆర్‌ఎంహెచ్‌పీ, కోక్ ఓవెన్స్, సింటర్ ప్లాంట్, బ్లాస్ట్ ఫర్నేస్, స్టీల్ మెల్ట్ షాప్, రోలింగ్ మిల్స్, సీఆర్‌ఎంపీ, ఎయిర్ సెపరేషన్ ప్లాంట్, ఎల్‌పీజీ స్టోరేజ్ ట్యాంక్‌లు, థర్మల్ పవర్ ప్లాంట్, వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎనర్జీమెనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్, గ్యాస్ హోల్డర్లు, స్టీల్‌ప్లాంట్‌లోని ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ తదితర కీలకమైన విభాగాల్లో అగ్నిమాపక సేవలు అందించడానికి ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని కోరింది. ఆదే విధంగా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, హాస్పిటాలిటీ సర్వీసెస్, హిల్‌టాప్ గెస్ట్‌హౌస్, ఎల్ అండ్ డీసీ, టౌన్‌షిప్, పాఠశాలలు, బ్యాంకులు, పోస్టాఫీస్, పబ్లిక్ బిల్డింగ్‌లలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉందని అందులో పేర్కొంది. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రంలోని ఫైర్ టెండర్లు, యంత్రాల వివరాలు పొందుపరిచారు. అతి ఉష్ణోగ్రతల్లో 24 గంటలు సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించింది. పూర్తి వివరాలతో సంప్రదించాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది.



స్టీల్‌ప్లాంట్ అగ్నిమాపక కేంద్రం

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం : మహా కుంభమేళాకు విచ్చేసే భక్తులు, తీర్థయాత్రికుల కోసం ఈస్ట్‌కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్ (08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 5, 19, ఫిబ్రవరి 16వ తేదీల్లో (ఆదివారం) రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి మంగళవారం రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 8, 22, ఫిబ్రవరి 19వ తేదీల్లో (బుధవారం) మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయల్దేరి శుక్రవారం మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు 4–థర్డ్ ఏసీ, 2–థర్డ్ ఏసీ ఎకానమి, 8–స్లీపర్ క్లాస్, 4–జనరల్ సెకండ్ సిటింగ్, 1–సెకండ్ క్లాస్ కం లగేజి /దివ్యాంగ, 1–జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.
- విశాఖపట్నం–దీన్ దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జనవరి 9, 16, 23, ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో (గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి శనివారం తెల్లవారు 4.30 గంటలకు దీన్ దయాళ్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ–విశాఖపట్నం(08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ జనవరి 11, 18, 25, ఫిబ్రవరి 8, 22, మార్చి 1వ తేదీల్లో శనివారం రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయలో బయల్దేరి సోమవారం తెల్లవారు 3.25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు 4–థర్డ్ ఏసీ, 2–థర్డ్ ఏసీ ఎకానమి, 8–స్లీపర్ క్లాస్, 4–జనరల్ సెకండ్ సిటింగ్, 1–సెకండ్ క్లాస్ కం లగేజి /దివ్యాంగ, 1–జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

రెప్పపాటులో ఘోరం



ప్రమాదానికి గురైన కారు

- శ్రీకాకుళం జిల్లా కంచిలి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- మరో ముగ్గురికి గాయాలు
- మొక్కు తీర్చుకోవడానికి జాజ్‌పూర్ వెళ్తుండగా దుర్ఘటన
- సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో విషాదం

-10లో

పైసలు కొట్టు కాంట్రాక్ట్ పట్టు!



ఏయూ ఇంజినీరింగ్ అధికారి ఇష్టారాజ్యం

- కాంట్రాక్టర్లుగా నమోదు కాని వారికి పనులు
- ఉద్యోగస్తులకు క్వార్టర్స్ కేటాయింపులోనూ చేతివాటం
- గతంలోనూ ఏయూ భూమిని తమ వారికి కట్టబెట్టే ప్రయత్నం
- అప్పటి వీసీ ప్రసాదరెడ్డి చొరవతో ఆ స్థలానికి రక్షణ గోడ నిర్మాణం

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగానికి అవినీతి మరకలు అంటుకుంటున్నాయి. విభాగంలోని ఓ అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చెలరేగిపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలే ఇన్‌చార్జి పాలనలో సా..గుతున్న ఇంజినీరింగ్ విభాగంలో ఆ అధికారి మాటే శాసనంగా మారుతోంది. దీంతో ఏకంగా వీసీ మాటను సైతం పక్కనపెట్టి సొంత నిర్ణయాలు అమలు చేస్తున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. అర్హత లేని వారికి కాంట్రాక్టులు అప్పగించడం నుంచి... క్వార్టర్ల కేటాయింపుల వరకు అన్నింటిలోను చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తూ.. గతంలో కాపాడిన ఏయూ భూములను తిరిగి కూటమి ఎమ్మెల్యేల అనుచరులకు అప్పగించేందుకు పన్నాగాలు పన్నుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

నామినేషన్ పద్ధతిలో పనులు

ఏయూలో ఏదైనా పనులు చేయాలంటే తప్పనిసరిగా కాంట్రాక్టర్‌గా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ సదరు అధికారి తలుచుకుంటూ ఎటువంటి నిబంధనలు అడ్డురావు. ఏయూలో కాంట్రాక్ట్ రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి కూడా కాంట్రాక్ట్ పనులు కేటాయించారన్న వాదనలు ఉన్నాయి. ఆ తరువాత వారిని కాంట్రాక్టర్లుగా నమోదు చేయిస్తున్నారు. సాధారణ ఫైల్స్ మాదిరిగానే కాంట్రాక్ట్ రిజిస్ట్రేషన్ ఫైల్‌పై వీసీ సంతకం చేయించి వారికి ఏయూ కాంట్రాక్టర్ హోదా కల్పించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారానికి భారీగానే వసూలు చేశారని ఇంజినీరింగ్ విభాగంలోనే సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. కనీసం కాంట్రాక్టర్లగా నమోదు కాని తమ వారిని తీసుకొచ్చి పనులు కేటాయించడం పట్ల ఏయూ ఇతర కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆరా తీసిన కాంట్రాక్టర్లకు పనులు కేటాయించకుండా.. నామినేషన్ పద్ధతిలో తనకు కావాల్సిన వారికి అప్పగిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.




క్వార్టర్ల కేటాయింపులో చేతివాటం



ఉద్యోగస్తులకు కేటాయించే క్వార్టర్స్ విషయంలో కూడా ఇంజినీరింగ్ విభాగంలో అధికారి తన చేతివాటాన్ని ప్రదర్శించారన్న ఆరోపణలు ఉన్నాయి. తనకు డబ్బులు ఇచ్చిన వారికి, సన్నిహితంగా ఉండే వారికి మాత్రమే క్వార్టర్స్‌ను కేటాయించారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏయూ ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తాను అనుకున్న వారికి మాత్రమే క్వార్టర్స్ కేటాయించి వాటికి మరమ్మతులు చేయించడం పట్ల అధికారులు కూడా ఆగ్రహంతో ఉన్నారు. ఓ రిటైర్డ్ ప్రొఫెసర్‌కు క్వార్టర్ల కేటాయింపు విషయంలో కూడా ఇదే జరిగినట్లు సమాచారం. ఈ విషయంలో వీసీ ఆదేశాలను సైతం పట్టించుకోలేదని వర్సిటీలో చర్చ జరుగుతోంది. ఈ విషయాన్ని ఏయూ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న కార్యకలాపాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

భూముల అన్యాక్రాంతానికి ప్రయత్నం

సదరు ఇంజినీరింగ్ అధికారి గతంలో కూడా యూనివర్సిటీకి సంబంధించిన విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. హనుమంతవాక జాతీయ రహదారికి ఆనుకొని ఏయూకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాలను కబ్జా చేయడానికి కొంత మంది ప్రయత్నించారు. ఆ సమయంలో సదరు అధికారి ఆ భూమిలో కేవలం మూడు ఎకరాలకు మాత్రమే ఫెన్సింగ్ వేసి మిగిలిన రెండు ఎకరాలను కబ్జాదారులకు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్న వాదనలు ఉన్నాయి. ఈ విషయాన్ని గ్రహించిన అప్పటి వీసీ ప్రసాదరెడ్డి ఆ ప్రయత్నాన్ని అడ్డుకొని మొత్తం భూమికి ప్రహరీ నిర్మించారు. అంతే కాకుండా మద్దిలపాలెం ప్రాంతంలో పిఠాపురం కాలనీలో కూడా ఏయూ భూముల అన్యాక్రాంతం విషయంలో ఇంజినీరింగ్ అధికారి పాత్ర ఉందన్న టాక్ వినిపించింది. అయితే, ఈ అధికారి వెనుక కూటమికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ఓ కార్పొరేటర్ పాత్ర కూడా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు



దాబాగార్డెన్స్: నగర ప్రజలకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ సంయుక్తంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు ఒకరి పట్ల మరొకరు ప్రేమ, క్షమ, దయ కలిగి ఉండి కలిసి మెలిసి ఆనందంగా క్రిస్మస్ జరుపుకోవాలన్నారు. ఏసు క్రీస్తు చల్లని దీవెనలు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

జూ క్యూరేటర్‌గా మంగమ్మ



ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు క్యూరేటర్‌గా జి.మంగమ్మ నియామకయ్యారు. ప్రస్తుతం అదనపు క్యూరేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) మంగళవారం జీవో విడుదల చేశారు. సుమారు నాలుగేళ్లపాటు జూ క్యూరేటర్‌గా ఇక్కడ పనిచేసిన డాక్టర్ నందనీ సలారియాకు ఈ ఏడాది అక్టోబరులో బదిలీ జరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మంగమ్మ అదనపు క్యూరేటరేగా విధులు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి డ్వాక్రా మేళా



సిద్ధమైన స్టాళ్లు

ఎంవీపీకాలనీ: ఏఎస్ రాజా మైదానంలో బుధవారం డ్వాక్రా మేళా ప్రారంభంకానుంది. జీవీఎంసీ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న మేళాలో 100 స్టాళ్ల ద్వారా వివిధ రకాల డ్వాక్రా ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు విక్రయిస్తారు. ఈ మేళాలో 20 ఫుడ్ స్టాళ్లను కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరగనున్నాయి. డ్వాక్రా సంఘాల తయారు చేసిన ఉత్పత్తులు, చీరలు, వివిధ రకాల వస్త్రాలు, బొమ్మలు, గృహోపకరణాలు ఈ మేళా ద్వారా విక్రయించనున్నారు. నగర ప్రజలు మేళాను సందర్శించి విజయవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

పీఆర్‌ఎస్‌ఐ అవార్డు గ్రహీతలకు మేయర్ అభినందనలు

అల్లిపురం : పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఇటీవల రాయపూర్‌లో నిర్వహించిన 46వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో జీవీఎంసీతో పాటు నగరంలోని పలు సంస్థలు 11 జాతీయ అవార్డులు దక్కించుకోవడం అభినందనీయమని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీవోలు ప్రజలను చైతన్యం పరిచేలా చేపట్టిన కార్యక్రమాలు నగర భవిష్యత్‌కు దోహదపడతాయన్నారు. ఉత్తమ ప్రజా అవగాహన కేటగిరీలో అవార్డును జీవీఎంసీ సొంతం చేసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం పీఆర్‌ఎస్‌ఐ చాప్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు రెండు అవార్డులు, జేడీ ఫౌండేషన్‌కు ఒకటి, కొల్లూరు రామారావుకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, పీఆర్‌ఎస్‌ఐ సెక్రటరీ జనరల్, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ డాక్టర్ పీఎల్‌కే మూర్తి, చాప్టర్ చైర్మన్, హెచ్‌పీసీఎల్ మాజీ పీఆర్‌వో కాశీ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు పొందిన చాప్టర్స్ ప్రతినిధులతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.23.76 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో శిరీష

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించారు. దేవదాయ శాఖ తనిఖీదారులు, విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈవో కె.శిరీష ఆధ్వర్యంలో దేవస్థానం ఆవరణలో హుండీ లెక్కింపు చేపట్టారు. 38 రోజులకు గానూ రూ.23.76లక్షల నగదు, 21 గ్రాముల 400 మిల్లీగ్రాముల బంగారం, 0.107 కిలోల వెండి, 96 యూఎస్ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 200 యుఏఈ దిర్హామ్, 111 చెక్కులు లభించినట్లు ఈవో తెలిపారు. శివజ్యోతి సేవా సంఘం సభ్యులు, దేవస్థానం సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

జాయింట్ కలెక్టరు మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: వినియోగదారుల హక్కులపై ప్రజల్లో అవగాహన పెంచాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తయారీ సంస్థలపై ఫిర్యాదులకు సంబంధిత శాఖల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విక్రయ సంస్థలు, తయారీ, సేవా సంస్థల మోసాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం పొందవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు–1 జి.తనుజారెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు సంబంధించిన కేసులను మూడు నెలల వ్యవధిలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం లేదా లోక్ అదాలత్ ఉపయోగించుకోవచ్చన్నారు. రూ.50 లక్షల పరిహారం వరకు జిల్లా స్థాయిలో కేసు వేసుకోవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు–2 జి.వెంకటేశ్వరి మాట్లాడుతూ వస్తులోపం, సేవాలోపం జరిగినప్పుడు నష్టపరిహారం పొందేహక్కు ప్రతి వినియోగదారునికి ఉంటుందన్నారు. కేసులు త్వరగా పరిష్కరించుటకు ప్రభుత్వ శాఖల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి భాస్కర్ రావు, తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ రామారావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి నందాజీ, జిల్లా డ్రగ్ కంట్రోల్ సహాయ సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ శాఖాపరంగా అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ముందుగా తూనికలు కొలతల శాఖ, జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ, జిల్లా డ్రగ్ కంట్రోల్, బీఐఎస్, ఐవోసీ, సివిల్ సప్లయి శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం వినియోగదారుల హక్కులపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘం ప్రతినిధులు కాండ్రేగుల వెంకటరమణ, సివిల్ సప్లయి అధికారులు, వినియోగదారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కేటర్ చంద్రశేఖర్‌కు అభినందనలు


చంద్రశేఖర్‌ని అభినందిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన చంద్రశేఖర్ చిన్న వయసులోనే స్కేటింగ్‌లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నాడు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఈ బాలుడు కపుల్స్ డ్యాన్స్‌లో ఒక రజతం, పెయిర్ స్కేటింగ్‌లో రెండు రజతాలు, రాష్ట్ర స్థాయి కపుల్స్ డ్యాన్స్‌లో ఒక రజతం, ఫైల్ స్కేటింగ్‌లో ఒక కాంస్యం, జాతీయ స్థాయిలో కపుల్ డ్యాన్స్‌లో ఒక రజతం సాధించాడు. ఈ సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి.. చంద్రశేఖర్‌ను అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. బాలుడిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, శిక్షణ ఇస్తున్న కోచ్‌లు సింహాద్రి, అనుదీప్‌లను కూడా ఆమె అభినందించారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: నిర్వహణ పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రాజమండ్రి-విశాఖపట్నం(07466) మెము స్పెషల్, 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు విశాఖపట్నం-రాజమండ్రి (07467) మెము స్పెషల్, 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు విశాఖపట్నం-విజయనగరం(07468) మెము స్పెషల్, 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు విజయనగరం-విశాఖపట్నం (07469) మెము స్పెషల్, ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం (07470/07471) మెము స్పెషల్ రద్దయ్యాయి.

- 29న రూర్కెలా-జగదల్‌పూర్-రూర్కెలా (18107/18108) ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-బనారస్(18311) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 30వ తేదీన బనారస్-విశాఖపట్నం(18312) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

బొకారో ఎక్స్‌ప్రెస్‌కు అదనపు జనరల్ కోచ్

ఈ నెల 26వ తేదీ నుంచి దన్‌బాద్-అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్‌కు, ఈ నెల 29వ తేదీ నుంచి అలెప్పి -ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్‌కు జనరల్ సెకండ్ క్లాస్ సిటింగ్ కోచ్‌ను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు.

రెప్పపాటులో ఘోరం

ఐదువందల పైచిలుకు కిలోమీటర్ల దూరం.. జాతీయ రహదారిపై కారులో నిదానంగా వెళ్తే దాదాపు పది గంటల సేపు ప్రయాణం. అప్పటికే వారు సగం దూరం ప్రయాణం పూర్తి చేశారు. ఇంకాసేపైతే ఆంధ్రప్రదేశ్ పరిధి దాటి ఒడిశాలోకి ప్రవేశిస్తారు. కానీ అక్కడే వారి ప్రయాణం ఆగిపోయింది. అంత సేపు కారు నడిపిన అలసట.. అతివేగం.. నిద్రమత్తు కలగలిపి వారి జీవిత ప్రయాణాన్ని ఆపేశాయి. అదుపు తప్పిన వారి కారు జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంటే.. ఆ ధాటికి స్తంభం ఏకంగా విరిగిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. జాజ్‌పూర్ శక్తిపీఠంలో మొక్కు తీర్చుకోవడానికి వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది.

- శ్రీకాకుళం జిల్లా కంచిలి సమీపంలో రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- మొక్కు తీర్చుకోవడానికి జాజ్‌పూర్ వెళ్తుండగా దుర్ఘటన
- సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో విషాదం


కారు ఢీకొనడంతో విరిగిపోయిన విద్యుత్ స్తంభం


కారులో లావణ్య మృతదేహం


నేహా గుప్తా, సోమేశ్వరరావు మృతదేహాలు

సీతమ్మధార/కంచిలి: శ్రీకాకుళం జిల్లా కంచిలి మండల పరిధి పెద్దకొజ్జిరియా–చిన్నకొజ్జిరియా గ్రామ కూడళ్ల మధ్యలో మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంతో వచ్చిన కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముత్తా లావణ్య(43), ముత్తా నేహా గుప్తా(18), కదిరిశెట్టి సోమేశ్వరరావు(49) దుర్మరణం పాలయ్యారు. మరొకరు తీవ్రంగా, మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా సీతమ్మధారకు చెందిన వారు. వివరాల్లోకి వెళ్తే..

సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శ్రీ సుబ్బనారాయణ హైట్స్ ఫ్లాట్ నంబర్ 301లో ముత్తా వెంకట రంగ రాజేష్ కుటుంబం నివాసం ఉంటున్నారు. రాజేష్ కుమార్తెకు సంబంధించి మొక్కు తీర్చుకోవడానికి సీతమ్మధార నుంచి మంగళవారం ఉదయం 5.30 గంటలకు కారులో ఒడిశాలోని జాజ్‌పూర్‌లో గల గిరిజామాత అమ్మవారి దర్శనానికి బయలుదేరారు. రాజేష్ భార్య లావణ్య, కుమార్తె నేహా గుప్తా, తల్లి సుబ్బలక్ష్మితోపాటు తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు, ఆయన భార్య రాధికలతో కలిసి కారులో ప్రయాణిస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో కంచిలి మండలం చిన్నకొజ్జిరియా గ్రామకూడలి వద్దకు వచ్చేసరికి వాహనాన్ని నడుపుతున్న ముత్తా వెంకట రంగ రాజేష్ అతివేగంతో ఉండి.. నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కన బెర్మ్ వైపు దిగి ఆ పక్కన ఉన్న 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా అదుపు తప్పి మళ్లీ రోడ్డు మీదకు చేరి.. పల్టీలు కొడుతూ మరికొంత దూరం వెళ్లిపోయి బోల్తాపడింది. కారు ఢీకొన్న వేగానికి విద్యుత్ స్తంభం ఏకంగా విరిగిపోయింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న రాజేష్ భార్య లావణ్య(43) కారులో నలిగిపోయి అక్కడికక్కడే చనిపోయారు. కుమార్తె నేహా గుప్తా(18), తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు(49)లను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో మృతిచెందారు. సోమేశ్వరరావు భార్య రాధిక తీవ్రగాయాల పాలవ్వడంతో పరిస్థితి విషమించింది. దీంతో ఆమెను శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వాహనం నడుపుతున్న రాజేష్‌తోపాటు ఆయన తల్లి సుబ్బలక్ష్మి స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరికి సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. నేహా గుప్తాకు పాట్నా ఐఐటీలో సీటు వచ్చిన సందర్భంగా మొక్కు తీర్చుకోవడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

హాహాకారాలు..

ప్రమాదంలో ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో తీవ్ర విషాదం చోటుచేసుకొంది. జాతీయ రహదారిపై వాహన రాకపోకలు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరగడం, ఆ సమయంలో మరే వాహనం రాకపోవడంతో కుడివైపు ఉన్న ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారులో మూడు వరసల్లో సీట్లలో ఆరుగురు కూర్చుండగా, ఎడమ వైపు విద్యుత్ స్తంభం ఢీకొనడంతో ఆ వైపు కూర్చున్నవారంతా ప్రమాదానికి గురైనట్లు అక్కడి పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది.


బంధువుల వద్ద రోదిస్తున్న బాధితుడు వెంకట రంగ రాజేష్, తల్లి సుబ్బలక్ష్మి

భద్రాచలం నుంచి వచ్చి..

మృతుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు భద్రాచలంలో ఐటీసీ పేపర్ ఇండస్ట్రీలో ఉద్యోగి. ఆయనకు భార్య రాధిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు సోమవారం అర్ధరాత్రి విశాఖపట్నం చేరుకున్నారు. అంతా కలిసి మంగళవారం ఉదయం ఒడిశాలోని ఆలయానికి బయలుదేరారు. రాజేష్ ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ వ్యాపారం చేస్తుంటారు. కొద్ది రోజుల కిందట కారులో పాట్నా వెళ్లి వచ్చారు. దూర ప్రాంతాలకు కారులోనే ఎక్కువగా ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. భార్య, కుమార్తె, తోడల్లుడు కళ్లెదుటే మృతి చెందడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని పరామర్శకు వచ్చిన బంధువులకు జరిగిన విషయం చెబుతూ.. గుండెలు బాదుకుంటూ రోదించారు.

ప్రమాదంపై అధికారుల ఆరా

ప్రమాదం విషయాన్ని తెలుసుకుని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ సంఘటన స్థలంతోపాటు, ఆస్పత్రికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ప్రభుత్వాస్పత్రికి వచ్చి వెంకట రంగ రాజేష్‌ను పరామర్శించారు.

21న ఘనంగా కుమార్తె పుట్టిన రోజు వేడుకలు

రాజేష్ తన కుమార్తె నేహా గుప్తా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాట్నా ఐఐటీలో చేరిన తర్వాత మొదటిసారి వారం రోజుల కిందట ఆమె ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసుల మధ్య ఈ నెల 21న ఆమె పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారి దర్శనం తర్వాత ఆమె పాట్నా వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంది. ఇంతలో ఈ ఘోరం జరిగింది. సమాచారం తెలుసుకున్న అపార్ట్‌మెంట్ వాసులు కన్నీటిపర్యంతమయ్యారు.

ఐఐఎంవీకి రెండు పీఆర్ఎస్ఐ అవార్డులు


డిప్యూటీ సీఎం అరుణ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న ఐఐఎంవీ ప్రతినిధి

విశాఖ సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం(ఐఐఎంవీ) ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్ఎస్ఐ) జాతీయ అవార్డులతో ఘనతను సాధించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ గత మూడు రోజులుగా జరిగిన 46వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ సదస్సులో రెండు కేటగిరీలలో ప్రథమ స్థానాన్ని, మరో రెండు కేటగిరీలలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. కాఫీ టేబుల్ బుక్ కేటగిరీలో 'ది సోషల్ ఇంపాక్ట్‌ప్రెన్యూర్స్ ప్రోగ్రాం–ది క్రానికల్స్ ఆఫ్ ఇంపాక్ట్‌ఫుల్ స్టార్టప్స్'కు, రక్షణ రంగ విభాగంలో డీఆర్‌డీవోలో ఆర్‌అండ్‌డీ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలకు గాను ప్రథమ స్థానం లభించింది. మహిళాభివృద్ధి విభాగంలో ఉత్తమ సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌కు, నైపుణ్యాభివృద్ధి విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఐఐఎంవీ సాధించిన ఈ ఘనత పట్ల ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ సంతోషం వ్యక్తం చేశారు.

ఆటోనగర్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేశాం


సమావేశంలో మాట్లాడుతున్న ఐలా చైర్మన్ సత్యనారాయణరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేశామని ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి(రఘు) అన్నారు. ఆటోనగర్ ఐలా భవనంలో ఆటోనగర్ ఏపీఐఐసీ ఐలా గాజువాక నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ 20వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లో తలపెట్టనున్న పనులను వివరించారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణపనులు ప్రారంభం సంతోషదాయకమన్నారు. విశాఖ జిల్లాలోనే అండర్ కేబుల్ ఎలక్ట్రికల్ పనులు ప్రథమంగా ఆటోనగర్‌లో జరిగాయన్నారు. ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ నుంచి అస్తవ్యస్తంగా ఉన్న ప్రధాన రహదారిని ఇరువైపులా 7 మీటర్ల విస్తీర్ణంలో రూ.10.87 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. శానిటేషన్ పనులు, రూ.1.1 కోట్లతో ప్రతి బ్లాక్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. హెల్త్ సెంటర్, పారిశ్రామిక కుటుంబాలకు ఆటవిడుపుగా ఇండోర్ స్టేడియం, 0.5 మెగా వాట్ల సోలార్ ప్లాంట్, పార్కింగ్ యార్డు అభివృద్ధి వంటి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఐలా కార్యదర్శి చీకటి సత్యన్నారాయణ తన నివేదికను చదివి వినిపించారు. కోశాధికారి పి.పద్మావతి ఐలా ట్యాక్స్‌లపై వివరణ ఇచ్చారు. ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, శేషగిరిరావు, రాంప్రసాద్‌లు కోశాధికారి వివరణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, పారిశ్రామిక వేత్తలు మాట్లాడుతూ పలు బ్లాకుల్లో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్, అస్తవ్యస్తంగా డ్రైన్లు ఉన్నాయన్నారు. దొంగల బెడద ఎక్కువగా ఉందని, రాత్రి పెట్రోలింగ్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలు పొందుపర్చిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఐలా ఇన్‌చార్జ్ జెడ్‌ఎం బి.హరిధరరావు, కమిషనర్ ఎ.కిషోర్, పెదగంట్యాడ పోవా అధ్యక్షుడు వి.సత్యన్నారాయణ, పలు బ్లాకుల సభ్యులు సుంకర పద్మజ, చుందూరు విశాలక్షి, జి.అశోక్ రాజ్, కర్రి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

టిబెటన్ యూత్ కాంగ్రెస్ ప్రపంచ శాంతి యాత్ర



శాంతిని కోరుతూ ప్రచారం చేస్తున్న టిబెటన్ యువకులు

సీతంపేట: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ టిబెటన్ యూత్ కాంగ్రెస్‌కు చెందిన 15 మంది యువకులు మోటార్ సైకిళ్లపై యాత్ర చేస్తూ మంగళవారం లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌ను సందర్శించారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి కె.ఎస్.ఎన్.మూర్తి వారికి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ భారతదేశం గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ శాంతి స్థాపన కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. దలైలామాతో కలిసి శాంతి కోసం పాటుపడుతున్న టిబెట్ ప్రజలకు తమ మద్దతు ఉంటుందన్నారు. అహింసా మార్గంలో ఏదైనా సాధించవచ్చునని ఆయన హితవు పలికారు. టిబెటన్ యూత్ కాంగ్రెస్ నాయకుడు గాన్‌పో ధున్‌దప్ మాట్లాడుతూ టిబెట్ శాంతిని కోరుకునే దేశమని, టిబెట్ యువతలో ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విద్య అభివృద్ధికి టిబెటన్ యూత్ కాంగ్రెస్ ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తోందని వివరించారు. దలైలామా ఆశీస్సులతో, భారత ప్రజల సహకారాన్ని కోరుతూ ఈ పర్యటన చేస్తున్నట్లు వెల్లడించారు. భారత దేశ ప్రజల ఆదరణ బాగుందన్న ఆయన గాంధీ సెంటర్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి, కృష్ణారావు, రాజు, సురేష్ పాల్గొన్నారు.

బాలుడి ఆత్మహత్య


బాలుడు ముక్కు నుంచి వస్తున్న రక్తం

సీతమ్మధార: అక్కయ్యపాలెంలోని ఎన్జీవోస్ కాలనీకి చెందిన అరూష్ అమన్(13) షూ లేస్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. జార్ఖండ్‌లో ఉండే అతని తల్లిదండ్రులు విడిపోయారు. ప్రస్తుతం అతని తల్లి మోహికా షా గౌహతిలో ఉద్యోగం చేస్తున్నారు. దీంతో అమన్ తాత, అమ్మమ్మల వద్ద ఉంటూ.. 8వ చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడటంతో పాటు హర్రర్ వీడియోలు చూస్తుంటాడు. తాత వినోద్‌కుమార్ మిలటరీ ఇంజినీరింగ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా.. మధ్యాహ్నం 1.30 గంటలకు బాత్రూమ్‌కు వెళ్లిన అమన్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అమ్మమ్మ తలుపు తట్టింది. తలుపు తీయకపోవడంతో ఆమె తన భర్తకు ఫోన్ చేసింది. ఆయన స్థానికులకు చెప్పడంతో వారు తలుపు తీశారు. అమన్ షూ లేస్‌తో దుస్తులు వేసే రాడ్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. వినోద్ కుమార్ షా ఫిర్యాదు మేరకు సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. బాలుడు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

జేఎన్ ఫార్మాలో ప్రమాదం

ఎలక్ట్రీషియన్ కంటికి గాయం

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని యాక్టిస్ జనరిక్స్ పరిశ్రమలో మంగళవారం ఉదయం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న సింహాచలం ప్రాంతానికి చెందిన మణి శంకర్ కంటికి గాయమైంది. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పరిశ్రమ పరిసరాలను హెల్పర్ శుభ్రం చేస్తున్న సమయంలో మెటల్ రవ్వలాంటిది విధి నిర్వహణలో ఉన్న మణిశంకర్ కంటికి తగిలింది. ఆ సమయంలో కంటిని చేతితో నలపడంతో వాచిపోయింది. సదరు కార్మికుడిని నగరంలోని ఓ కంటి ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ప్రస్తుతం కార్మికుడి కంటికి ఎలాంటి అపాయం లేదని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. సమాచారం అందుకున్న పరవాడ డిప్యూటీ తహసీల్దార్ సురేష్ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

అపర్ణకు కేంద్ర మంత్రి అభినందన


అపర్ణను అభినందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్

గోపాలపట్నం: కూచిపూడి నృత్యంలో సౌతిండియా ఉమెన్ అచీవర్స్ అవార్డు పొందిన అపర్ణను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఢిల్లీ నుంచి వచ్చిన మంత్రిని విశాఖ విమానాశ్రయంలో అపర్ణ కుటుంబ సభ్యులు మంగళవారం కలిశారు. తాను సాధించిన షీల్డులు, ప్రశంసాపత్రాలను ఆయన చేతుల మీదుగా అపర్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆమెను ప్రశంసించారు.